ప్రజాశక్తి

ఆదివారం 11 జూన్ 2023 | 5 | అనంతపురం





కమ్యూనిటీ హాల్ ముందు కురుబ కులస్తులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

మోగనున్న బడిగంట

◆ రేపు పాఠశాలల పున:ప్రారంభం ◆ సిద్ధం అవుతున్న తరగతి గదులు ◆ పలు పాఠశాలల్లో సమస్యల స్వాగతం

దాదాపు రెండు నెలల తరువాత పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల ముగింపు అనంతరం సోమవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని పాఠశాలల పున:ప్రారంభానికి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల తరగతి గదులనూ సిద్ధం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు పంపే ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాయి. నాడు-నేడు పనులు జరుగుతున్నా ఇంకా చాలా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగనట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి ఇబ్బందిగానే ఉంది.



ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 5129 పాఠశాలలుంటే ప్రభుత్వ పాఠశాలలు, 3841 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,58,072 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగులు, యూనిపామ్, బెల్టులు, బూట్లు జగనన్న విద్యా కానుక (జెవికె) కింద అందజేయాల్సి ఉంది. పాఠశాలల ప్రారంభం రోజును వీటిని అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఏ మేరకు ఇవి పాఠశాలలకు చేరాయన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. మొత్తం విద్యార్థులకు ఒకే సారి ఇస్తారా లేక గతేడాది మాదిరిగానే కొద్దిమంది విద్యార్థులకు అందజేసి తరువాత ఇస్తామని చెబుతారన్న అన్నది తెలియాల్సి ఉంది. .

అసంపూర్తిగానే నాడు-నేడు పనులు

ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పనులను ప్రారంభించింది. వీటి ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే రెండు విడతలుగా ఈ పనులు జరిగాయి. మూడో విడత పనులు జరుగుతున్నాఇయ. అయితే ఈ పనులు చాలా పాఠశాలల్లో అసంపూర్తిగా జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో కొంత మేర పనులు జరిగినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఆ వేగంతో పనులు జరగనట్లు తెలుస్తోంది. పాత తరగతి గదిలోనే ఈ ఏడాది కూడా పాఠాలు బోధించే పరిస్థితి చాలా పాఠశాలల్లో కన్పిస్తోంది. శిథిలమైన తరగతి గదులు నేటికీ చాలా పాఠశాలల్లో దర్శనం ఇస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోగా ఉన్నచోట్ల ఉపయోగించే స్థితిలో లేవు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి. దీంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. అనేక పాఠశాలల్లో తరగతి గదులు అధ్వానంగా ఉన్నాయి.కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేవు. పక్కనే మురుగు కాలువలు ఉన్నాయి. దీంతో పశువులు, పందులు వంటివి పాఠశాలల ఆవరణల్లో తిరుగుతూ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేక గదులు లేవు. దీంతో తరగతి గదుల పక్కన... లేదంటే పాఠశాలలో ఓ మూలన నాలుగు బండల మాటున వంటలు తయారు చేస్తున్నారు. ఆరుబయట వంట శాలలు ఉన్న పాఠశాలల్లో వర్షాకాలం వచ్చిందంటే వంటలు చేయడానికి ఇబ్బందిగా ఉంటోంది. మొత్తం మీద ఈ సారి కూడా చాలా వరకు పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికేలా పరిస్థితి కన్పిస్తోంది.

తెగని 'వెంకటాపురం' పంచాయితీ

◆ ఎంపీ గోరంట్ల మాధవ్ నిరసన
◆ కురుబ కమ్యూనిటీ హాల్ తెరవాలంటూ డిమాండ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అధికార పార్టీలో బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామంలోని కురుబ కమ్యూనిటీ హాల్ వివాదం కాకరేపుతోంది. గత మూడు రోజులుగా ఈ వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. శనివారం నాడు హిందూపురం ఎంపీ కమ్యూనిటీ హాల్‌ను తెరవాలంటూ ఏకంగా ఆ గ్రామంలో నిరసనకు దిగడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామంలో కమ్యూనిటీ హాల్ ఉంది. ఈ భవనానికి సంబంధించి ఆ గ్రామంలో కురుబ కులస్తులు ఏడు సంవత్సరాల క్రితం స్థలాన్ని పంచాయతీ వారితో తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భవనం, గుడిని నిర్మించుకునేందుకు నిధులు కావాలంటూ టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ జేసీ దివాకర్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఆయన రూ.10 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేశారు. అయితే గుడి పేరుతో నిధులు మంజూరు అయ్యేందుకు సాంకేతిక సమస్యలు రావడంతో దానిని కమ్యూనిటీ హాల్‌గా మార్చి నిధులు మంజూరు చేయించుకున్నారు. భవనం నిర్మాణ పనులు పూర్తయిన తరువాత అందులో కురుబ కలస్తులు వజ్జనప్ప, అతకల్లప్ప స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని గత ఆరేళ్లుగా పూజలు చేసుకుంటున్నారు.

కమ్యూనిటీ హాల్ అంటూ వివాదం..

ఇటీవల ఆ గ్రామంలో కొందరు అధికార పార్టీ నేతలు ఆ భవనం కమ్యూనిటీ హాల్‌కు చెందినదని దానిని మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు కేటాయించాలంటూ అధికారులను కోరారు. దీనికి పంచాయతీ అధికారులు అంగీకరించారు. ఈ మేరకు ఆ భవనానికి మూడు రోజుల క్రితం తాళాలు వేశారు.

ఎంపీ మాధవ్ నిరసన

కురుబ కమ్యూనిటీ హాల్‌కు తాళాలు వేయడంపై ఆ గ్రామ కురుబలు శుక్రవారం నాడు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇదే విషయాన్ని ఎంపీ గోరంట్ల మాధవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన శనివారం నాడు వెంకటాపురం గ్రామానికి చెరుకుని కురుబ కులస్తులతో కలిసి కమ్యూనిటీ భవనం వద్ద నిరసన తెలిపారు. ఒక్కసారిగా మాధవ్ నిరసనతో అధికార పార్టీ నాయకుల్లో అలజడి నెలకొంది. పోలీసులు, పంచాయతీ అధికారులు అక్కడికి చేరుకుని ఎంపీతో మాట్లాడారు. అనంతరం కమ్యూనిటీ భవనం తలుపులు తీయించారు. కురుబలు అందులో యథావిధిగా పూజలు చేయించేలా చర్యలు తీసుకోవాలంటూ ఎంపీ అధికారులకు సూచించారు. కాగ ఈ ఘటన అధికార పార్టీలో పెను దుమారాన్ని రేపుతున్నట్లు తెలుస్తోంది. ఎంపీ గోరంట్ల మాధవ్ చర్యను శింగనమల నియోజకవర్గ అధికార పార్టీ నేతలు తప్పుబడుతున్నట్లు తెలుస్తోంది. తన పార్లమెంట్ పరిధిలోకి రాని గ్రామంలోకి వచ్చి ఎంపీ నిరసన చేయడం ఏమిటంటూ వైసిపి ఎస్సీ సెల్ బుక్కరాయసముద్రం మండల అధ్యక్షుడు ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం మీద వెంకటాపురం దేవుళ్ల పంచాయితీ అధికార పార్టీలో పెను దుమారాన్నే రేపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన విద్యుత్ ఛార్జీలు పెంచి వందల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిందని, తక్షణం వీటిని ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం 1400 కోట్ల రూపాయల భారాన్ని సర్దుబాటు ఛార్జీల పేరుతో వేయగా, ఈ సంవత్సరం మరో ఆరువేల కోట్ల రూపాయల భారం వేసిందన్నారు. 2014 సంవత్సరం నుంచి యూనిట్‌కు 20పైసలు చొప్పున అదనపు భారాన్ని వేస్తున్నారని చెప్పారు. ఒకవైపు పెరుగుతున్న ధరలతో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలపై ఈరకంగా ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. ప్రపంచంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల విద్యుత్ ఛార్జీల తగ్గుతుండగా ఆంధ్ర రాష్ట్రంలో సోలార్ గాలి మరల విద్యుత్ ఉత్పత్తి పెరుగుతుందని ఒక వైపు చెబుతూ మరోవైపు ప్రజలపై భారాలు వేయడం ఎవరికోసమని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు విద్యుత్ రంగాన్ని అప్పగించి ఆ భారాలను ప్రజలపై మోసేందుకు సన్నద్ధం చేసే అందులో భాగమే ఈ ఛార్జీల బాదుడని విమర్శించారు. తక్షనం పెంచిన ఈ విద్యుత్ ఛార్జీల భారాలు అన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాల కారణాలను ప్రజలకు వివరించేందుకు ఆది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఎం బందాలు పర్యటనలు చేస్తాయని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలు పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

అనంతపురం : నగరంలో పాతూరులో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలనునాయన అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు. నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు శ్రీధర్, టిడిపిబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, గోపాల్, సురేష్, మున్వర్, సుధాకర్, దూదేకుల బాబా ఫక్రుద్దీన్, సాయి, బాబ్జాన్, జాఫర్, వెంకట్రాముడు తదితరులు కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందమూరి బాల కృష్ణ పౌరాణిక పాత్రలు, సమాజానికి ఉపయోగపడే పాత్రలు పోషిస్తూ వెనుకబడిన జిల్లా అనంతపురం, అలాగే హిందూపురం అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. బసవతారకం ట్రస్టు ద్వారా ఎంతో మంది క్యాన్సర్ బాధితులకు బాసటగా నిలిచిన బాలయ్య అభిమానులుగా గర్వపడుతున్నామన్నారు. కరోనా సమయంలో ఉచితంగా మెడికల్ కిట్లను, వైద్య సేవలను అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న బాలకృష్ణ అభిమానులు

19న కలెక్టరేట్ ముట్టడి

పెద్దపప్పూరు : చేనేతల సమస్యలు పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కలెక్టరే ట్‌ను ముట్టడించనున్నట్లు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప తెలి పారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కుమ్మెత చౌడేశ్వరీవేది ఆలయం, నరసాపురం రాముల ఆలయాల్లో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలె క్టరేట్లను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 19న నిర్వహించనున్న ధర్నాలో ప్రతి ఒక్క రూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగనాయకులు, శివ నారాయణ, మురళి, రామాంజనేయులు, రంగా పాల్గొన్నారు.

జగన్ అవినీతి పాలనను తరిమికొట్టాలి

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి కారణమైన సిఎం జగన్ అవినీతి పాలనను ప్రజలు తరిమికొట్టాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మునిపెన్నడు చూడని కరెంటు కోతలు, ఛార్జీల మోతతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. గతనెలతో పోలిస్తే ఈనెలలో కరెంట్ బిల్లు దాదాపు రెట్టింపు అయిందన్నారు. రాష్ట్రం విడిపోయినప్పుడు 25 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరతతో నవ్యాంధ్ర ఏర్పడగా, ఆరు నెలల్లోగా మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చిన ఘనత చంద్రబాబుది అన్నారు. జగన్ అసమర్థత, అవినీతి వల్ల రాష్ట్రంలోని డిస్కములు తీవ్రనష్టాల్లో కూరుకుపోయాయన్నారు. గతేడాది జూన్‌తో పోలిస్తే ఎన్నడూ లేనంత 40 నుంచి 50 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరతతో రాష్ట్రం అల్లాడిపోయిందన్నారు. ఈసారి విద్యుత్ సంక్షోభం రాష్ట్ర ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ జగన్‌కు ఆదాయం.. ప్రజలకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ అసమర్థ, స్వార్థపూరిత విధానాలు ప్రజలపై అదనపు భారం పడిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై తాము పోరాటం చేసినప్పటికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు జగన్ దుష్టపాలనను తరిమికొట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య : కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-బెలుగుప్ప


ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జగనన్న విద్యాకానుక కిట్లు, యూనిఫాం, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నాన్నారు. అలాగే నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. అలాగే జగనన్న ఆణిముత్యాలు కింద ట్రైనింగ్ కూడా ఇస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరానికి 10వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ వీరబ్బాయి, ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి, ఎంఇఒ మల్లారెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరావు, జెఇ సుధాకర్, అధికారులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

'అనంత' అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

టిడిపి హయాంలో చేసిన అనంతపురం అభివృద్ధిపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి సవాల్ విసిరారు. శనివారం నగరంలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో జరిగిన అభివృద్ధి అంతా తమ హయాంలో జరిగిందంటూ ఎమ్మెల్యే అనంత మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంత అభివృద్ధిలో తనది చెరిగిపోని సంతకంలా నిలిచాయని తెలిపారు. ఎంపీగా ఉన్నప్పుడు ఎప్పుడైనా అనంతపురం అభివృద్ధికి కషి చేశావా, కేంద్ర మంత్రులు ఎవరినీ కలవకుండా నగరానికి రోడ్లు ఎలా తెచ్చావని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కలిసి తెచ్చాడని చెబుతున్నావు.. నేను గతంలో కేంద్ర మంత్రిని కలిసి సుభాష్ రోడ్డు, గుత్తి రోడ్డుకు నిధులు కేటాయించాలని, అడిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను, రోడ్డు భవనాల శాఖ అధికారులు ఎస్టిమేషన్లు అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా అసెంబ్లీలో మాట్లాడిన విషయాలపై రికార్డులు ఉన్నాయని పరిశీలించుకోవాలన్నారు. సూర్యానగర్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, హౌసింగ్‌బోర్డ్ రోడ్డు, రాంనగర్ 80 ఫీట్ రోడ్ ఎవరి హయాంలో వచ్చాయో పక్కన ఉన్న చెట్లను అడిగినా చెబుతాయని తెలిపారు. సుభాష్ రోడ్డు వంకర టింకరగా ఎవరి కోసం ఏర్పాటు చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. నగరంలో ఓపెన్ జిమ్‌లు, శిల్పారామం, పీస్ మెమోరియల్ హాల్, డ్వాక్రా మహిళల కోసం కమ్యూనిటీ హాల్ లు, రుద్రంపేటలో అప్పర్ ప్రైమరీ స్కూల్, రాజీవ్ కాలనీ బ్రిడ్జి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సెంట్రల్ యూనివర్సిటీ, 6 వేల టిడ్కో ఇల్లు, రాజీవ్ కాలనీ ప్రజలకు వేల పట్టాలు, మరాఠీ కాలనీ, అండర్ డ్రెయినేజీ ఏర్పాటులో భాగంగా నగరానికి నీటి సదుపాయం కల్పించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు కోసం హట్కో లోన్ అప్రువల్ కూడా చేయించామన్నారు. ఆధారాలతో సహా తన వద్ద ఉన్నాయని తెలిపారు. నీ హయాంలో మాత్రమే అభివృద్ధి చేశానని పదే పదే చెబుతున్నావు కాదా... చేసి ఉంటే చర్చకు రావాలన్నారు. నాలుగేళ్లలో ఎమ్మెల్యే చేసింది ఏమి లేదన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. అభివృద్ధి చేసి చెప్పుకోవాలని, నీవు మాత్రమే చేశావు. ఎవరూ చేయలేదంటూ అసత్యాలు చెప్పడం సరికాదన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గమనంలో పెట్టుకోవాలన్నారు.

ముగిసిన వేసవిశిక్షణ శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం శనివారం ఘనంగా ముగిశాయి. 33 రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు వందలాది మంది పిల్లలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా మోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, రమణా క్యాటరింగ్ అధినేత రవికాంత్ రమణ మాట్లాడుతూ ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహించి పిల్లల్లో సృజనాత్మకత పెంపుదల చేయడం అభినందనీయమన్నారు. పిల్లలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పొందిన ఆనందం వెలకట్టలేనిదన్నారు. వారికి తెలియ కుండానే ఆటలు, పాటల్లో పాల్గొని పోటీ తత్వాన్ని అలవర్చుకున్నారని తెలిపారు. సిఎం జగన్ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ పిల్లలు అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వారి ఆలోచనలను అమలు చేయడం ప్రజా ప్రతినిధులుగా బాధ్యతలు నిర్వర్తించడం ఆనందదాయకం అన్నారు. పిల్లలు వేసవి సెలవులను ఎంతో ఉల్లాసంగా ఉత్సాహకంగా గడిపేందుకు గ్రంథాలయాలు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. చదువుతో పాటు పిల్లలకు ఆట పాటలు కూడా ఉండాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెమెంటోలు బహూకరించారు. పిల్లలు సెలవు రోజుల్లో సెల్‌ఫోన్‌లు, టివీలు చూసి సమయం వృథా చేసుకోకుండా సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాలలో ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించామన్నారు. పిల్లలు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేశారని, అందుకు సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ వి.సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శివశంకర్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రామాంజనమ్మ, సిబ్బంది ఇంతియాజ్ అహమ్మద్, కావేరి, శంకర్, బాషా, హేమమాలిని, నాగమణి, మల్లి, బాలచంద్ర, ఉజ్జనేశ్వరి, రీసోర్స్‌పర్సన్‌లు వెంకటేషప్ప, సూర్య నారాయణ రెడ్డి, లక్ష్మి, రాజేష్, మహేష్, జ్యోతి, హేమలత విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా మోహన్‌రెడ

సంక్షోభంలో వ్యవసాయం

రైతు గర్జన ప్రచార జాతాలో నాయకులు
జాతాకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-ఉరవకొండ


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు రామచంద్రయ్య అన్నారు. నీటి సాధన కోసం సిపిఐ, ఏపీ రైతుసంఘం సంయుక్తంగా చేపట్టిన రైతు గర్జన ప్రచార జాతాను శనివారం ఉరవకొండలో ప్రారంభించారు. ఈ జాతాకు సిపిఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదననాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 140 కోట్ల మంది ప్రజలకు అన్నం పెట్టే రైతులను ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, పంట రుణాలు, పంట నష్ట పరిహారం, పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం కావడంతో రైతులు ఆర్థికంగా చితికిపోయారన్నారు. అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం అమలు చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని ప్రకటించడం శోచనీయమన్నారు. మరోవైపు సిఎం జగన్ కూడా తాను అధికారంలోకి వస్తే రూ.3,500 కోట్లతో ధరల స్థిరీకరణ ఏర్పాటు చేస్తామని చెప్పి అములు చేయలేదన్నారు. అనంతపురం జిల్లాలో వర్షాలకు పండ్ల తోటలను సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ పరిహారం ఇవ్వలేదన్నారు. మరోవైపు అక్రమంగా అప్పర్ భద్ర ప్రాజెక్టును నిర్మిస్తూ రాయలసీమను ఎడారి చేసేందుకు పూనుకున్నారన్నారు. అది అక్రమ ప్రాజెక్టు అని తెలిసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిధులు మంజూరు చేయడం బాధాకరమన్నారు. జిల్లావ్యాప్తంగా రైతుగర్జన ప్రచార జాతా అనంతరం ఈనెల 21న కలెక్టర్ కార్యాలయం ముందు రైతు గర్జన సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా ఉరవకొండలో ప్రారంభమైన జాతా చిన్నముష్టూరు, మోపిడి, ఆవిద్యాల, రాకెట్ల, కౌకుంట్లతోపాటు బొమ్మనహాల్ మండలం మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, రైతుసంఘం జిల్లా నాయకులు గోపాల్, సంగప్ప, నాగరాజు, నాయకులు మల్లికార్జున, సుల్తాన్, నారాయణమ్మ, హనుమంతు, రమణ, కార్మిక సంఘం నాయకులు చక్రధర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



రైతు గర్జన ప్రచార జాతాలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షులు రామచంద్రయ్య

నిస్వార్థంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం..

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నిస్వార్థంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆనంతపురం రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీలో రెండు సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లను ప్రారంభించారు. అనంతరం రుద్రంపేట 2వ సచివాలయం ఎదుట వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా నిస్వార్థంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఇది చూపి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా ప్రభుత్వ ఫలాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనాయాడారు. సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే పరిపాలన తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వాలంటీర్లు సేవలు అందిస్తుంటే ప్రతిపక్ష పార్టీ నేతలు వాలంటీర్ వ్యవస్థనే నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నారని చెప్పారు. జిల్లాకేంద్రంలో ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణం పనులు పూర్తి చేశామన్నారు. అంతేకాకుండా నగరానికి దీటుగా అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నాలుగు పంచాయతీలను అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం ఒక్క రుద్రంపేట పంచాయితీలో రూ.25 కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతేకాకుండా రూ.16 కోట్లతో రూరల్ పంచాయితీ ఖర్చు చేశామన్నారు. రానున్న మూడు మాసాల్లో అనంతపురం నుండి రుద్రంపేటకు వెళ్లే రహదారి విస్తరణతో పాటు బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేస్తామన్నారు. అనంతపురం రూరల్ మండలాల ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నారని, రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డితో కలిసి ఇప్పటికే నీటి సమస్యను గురించి వివరించామన్నారు. త్వరలోనే రూ.75కోట్లతో పీఏబీఆర్ జలాలను అనంతపురం రూరల్ మండలాల ప్రజలకు అందించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సర్పంచులు పద్మావతి, ఉదయ శంకర్, ఆశాబీ, ఎంపిపి వరలక్ష్మి, ఎంపిటిసిలు నారాయణమ్మ, ఓంప్రకాష్‌రెడ్డి, మహబూబ్‌బీ, ఆశాజ్యోతి, వైస్ సర్పంచి సుమిత్ర, వైసిపి సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కృష్ణవేణి, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఆదినారాయణ, సాదిక్, సుధాకర్‌రెడ్డి, తిరుపతినాయుడు, గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్, హుస్సేన్, బంగి సుదర్శన్, గంగాధర్, మూర్తి, అక్కులప్ప, పద్మావతి, విజయ్, ఎంపిడిఒ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు నరసింహారెడ్డి, అశోక్, ముత్యాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో నాలుగేళ్లుగా రైతులకు సేవ చేస్తున్న జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసుకు 'సేవారత్న పురస్కార అవార్డు' రావడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. శనివారం పద్మశాలి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాల నుంచి జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులు, రైతు కుటుంబాల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. రైతులకు వ్యవసాయ విధివిధానాల్లో శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు ఏనెలలో ఏ పంటలు వేయాలో రైతులకు సూచనలు ఇస్తూ రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తనవంతు సాయం చేస్తున్నారన్నారు. అంతేగాకుండా ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం తీసుకురావడం సంతోషకరమన్నారు. అనంతరం నాగమల్లి ఓబులేసు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకులు వెంకట్, నాగమల్లి ఎర్రిస్వామి, శ్రీనివాసులు, ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, ఎంపిపి చంద్రమ్మ, సర్పంచి లలితమ్మ, వార్డు మెంబర్ మల్లికార్జున, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఈతకెళ్లి యువకుడు మృతి

యాడికి : సరదాగా బావిలోకి ఈతకెళ్లి నీట మునిగి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కోన ఉప్పలపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యాడికి పాత పోలీస్‌స్టేషన్ ఎదురుగా మెటార్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్న దూదేకుల పాలమోహన్ కుమారుడు హనీఫ్ స్నేహితులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఉప్పలపాడు సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లారు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తూ బావిలో మునిగి మృతి చెందినట్లు స్నేహితులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బంధువులు, స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫోన్‌పే పేరుతో రూ.15 వేలు టోకరా

అనంతపురం క్రైం: ఫోన్‌పే చేస్తాం నగదు ఇవ్వాలంటూ రూ.15 వేలు తీసుకుని ఉడాయించిన ఘటన నగరంలోని శ్రీనివాసనగర్‌లో చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. మడకశిర అనే యువకుడు స్థానిక శ్రీనివాసనగర్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం ఇద్దరు యువకులు షాపు వద్దకు వచ్చి రూ.15వేలు ఫోన్‌పే చేస్తామని నగదు ఇవ్వాలని అడిగారు. ఫోన్‌పే చేస్తున్నట్లు నటించి నగదు తీసుకుని ఇందులో నెట్‌వర్క్ సరిగ్గా లేదు, బయట నిలబడిన మరో యువకుని వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకునే నెపంతో వెళ్లి ఉడాయించారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు వృత్తితోపాటు ఆరోగ్యమూ ముఖ్యమే

తాడిపత్రి డీఎస్పీ గంగయ్య

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

రాత్రి, పగలు తేడా లేకుండా సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు పాటు పడుతున్న పోలీసుల ఆరోగ్యంతోపాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని తాడిపత్రి డీఎస్పీ సీఎం గంగయ్య సూచించారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వుల మేరకు శనివారం రూరల్ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న టంగుటూరి ఫంక్షన్ హాల్‌లో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో కర్నూలు మెడికేర్ ఆసుపత్రి వైద్య, సిబ్బంది, తాడిపత్రి ప్రభుత్వాసుపత్రి వైద్యులు పోలీసులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డీఎస్పీ నేరుగా పోలీసుల కుటుంబ సభ్యులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాడిపత్రి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి దాదాపు 120 మంది వరకూ పోలీసులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి రూరల్, అర్బన్, యాడికి సర్కిల్ సీఐలు చిన్న పెద్దయ్య, ఆనందరావు, శంకర్‌రెడ్డి, తాడిపత్రి పట్టణ, రూరల్, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు ఎస్ఐలు ధరణిబాబు, మహమ్మద్‌గౌస్, గురుప్రసాద్‌రెడ్డి, ఖాజాహుస్సేన్, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




వైద్యసిబ్బందిని సన్మానిస్తున్న డీఎస్పీ సీఎం గంగయ్య, పోలీసులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

విద్యుత్ తీగల సవరింపు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో రోడ్లపై కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను ఎట్టకేలకూ అధికారులు స్పందించారు. ఈనెల 5న ప్రజాశక్తి పేపర్‌లో 'రోడ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు'.. అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు అధికారులు స్పందించి పుట్లూరు నుంచి నారాయణరెడ్డిపల్లెకు వెళ్లే రహదారిపై వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ తీగలను సమరిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

క్రీడా మైదానంలో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాల క్రీడా మైదానంలోని మొలిచిన పిచ్చి మొక్కలను పలువురు వాకర్లు, క్రీడాకారులు శనివారం తొలగించారు. అలాగే మైదాన పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో హాకీ శిక్షకులు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, పలువురు వాకర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలం చప్పిడి వెంగన్నపల్లి గ్రామంలో వెలిసిన ఉమా మహేశ్వర దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా శనివారం అనంతరం రాతిదూలం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపిపి రాఘవరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎంపీ రంగయ్య, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. కాగా రాతిదూలం లాగుడు పోటీలు తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

రాష్ట్ర వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌తో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి భేటీ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పివిఆర్ఎం.రెడ్డిని విజయవాడలోని కార్యాలయంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శనివారం మర్యాదకంగా కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా 2019 నుంచి వాటర్‌షెడ్ ఫారంపాండ్స్ కింద రైతులు తమ పొలాల్లో పనులు చేసుకున్నారన్నారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులు నేటికీ జమ చేయలేదన్నారు. కావున నిధులను వెంటనే రైతుల ఖాతాలకు జమ చేయాలని కోరారు. అలాగే జిల్లాలో వాటర్‌షెడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు రాష్ట్ర డైరెక్టర్ స్పందిస్తూ అనంతపురం జిల్లా అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వాల్మీకి కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని వినతి

నియోజకవర్గ కేంద్రంలో వాల్మీకి కల్యాణ మండపం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శులు పూనం మాలకొండయ్య, ధనుంజయరెడ్డిని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కలిసి విన్నవించారు. ఈ కల్యాణ మండపం నిర్మిస్తే నియోజకవర్గంలో అధికంగా ఉండే బోయ, వాల్మీకి కులస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కావున వెంటనే స్పందించి వాల్మీకి కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులు స్పందిస్తూ శిథిలావస్థలో ఉన్న వాల్మీకి కల్యాణ మండపాన్ని తొలగించి నూతన కల్యాణ మంటపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రాష్ట్ర వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పివిఆర్ఎం.రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

విద్యార్థులు చిన్నప్పటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని మండల విద్యాధికారి నాగరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో' అని ఒక మంచిమాటతో పుస్తకం విలువ, పుస్తకం ఆవశ్యకతను వివరించారు. పుస్తకము ఒక మంచి నేస్తం అన్నారు. నేటి చరిత్రను భావితరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకం అన్నార. కావున ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రవికుమార్‌నాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్.వీరారెడ్డి, కె.సేతు, తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ నాగరాజు, వక్తలు

స్ఫూర్తిదాయకం పైడిమర్రి 'ప్రతిజ్ఞ'

బ్రహ్మసముద్రం : స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్తాన్‌తో యుద్ధాలతో జరిగిన నష్టానికి ప్రజల్లో చైతన్య నింపడానికి పైడిమర్రి వెంకట సుబ్బారావు రాసిన 'ప్రతిజ్ఞ' ప్రజల్లో చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపిందని కవి సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు రాజన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో విద్యార్థులతో పైడిమర్రి రాసిన 'భారతదేశంలో మాతభూమి' అనే ప్రతిజ్ఞను అందరితో కలిసి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అంతటా చేసే ప్రతిజ్ఞను తెలుగుబిడ్డ అయిన పైడిమర్రి వెంకట సుబ్బారావు మనకు గర్వకారణం అన్నాడు. స్వాతంత్ర్య పోరాటం, సాహిత్య సేవల గురించి కొనియాడారు. ఆ ప్రతిభలోనే ప్రతి అంశం.. ప్రతి పదం.. వాక్యం.. భారత జాతీయ సంపదను కాపాడుతుందన్నారు. అంతేగాకుండా సోదరభావాన్ని, జాలి, దయను మనలో మేల్కొలుపుతోందన్నారు. పేర్కొన్నారు.

వారాహి యాత్ర విజయవంతం కావాలి

జనసేన ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

అనంతపురం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈనెల 14న తలపెట్టిన వారాహి యాత్ర జయప్రదం కావాలని కోరుతూ జనసేన నగర కార్యదర్శి లాల్‌స్వామి రాయల్, సంయుక్త కార్యదర్శి వెంకటరమణ ఆకాంక్షించారు. జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ సూచనల మేరకు నగర సమీపంలోని ఎ.నారాయణపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారాహి యాత్రకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా అధ్యక్షులు లీగల్‌సెల్ మురళీ, రాప్తాడు ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, చొప్ప చంద్ర, సంయుక్త కార్యదర్శులు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్ పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న జనసేన పార్టీ నాయకులు

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని పెద్దపప్పూరు-1, నరసాపురం, పసలూరు గ్రామ సచివాలయాలను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి సి.ఓబుళమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల్లో హాజరు పట్టికతోపాటు రికార్డులను పరిశీలించారు. అలాగే వైఎస్ఆర్ బీమా నమోదు, రెన్యువల్, మిషన్ లైఫ్, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, తదితర వాటిని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయకపోయినా, యూనిఫాం ధరించకపోయినా, స్పందన కార్యక్రమంలో పాల్గొనకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.రామకృష్ణ, ఇఒఆర్‌డి ఎస్.కమలాబాయి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి సి.ఓబుళమ్మ

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

యాడికి : స్థానిక మెయిన్ బజారులోని దేవిశెట్టి చిన్న రామయ్య కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రాఘవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం సహరి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు భానుకిరణ్, మాధవి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హాకీ రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా వెంకటేశ్‌నాయక్



ధర్మవరం టౌన్ : హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకూ ఒడిశాలో జరుగుతున్న 13వ జాతీయ జూనియర్ పురుషుల హాకీ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొనే హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారుడు వెంకటేశ్ నాయక్ కెప్టెన్‌గా ఎన్నికైనట్లు జిల్లా హాకీ కోచ్ హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో వెంకటేశ్ నాయక్‌ను కోచ్‌తో పాటు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాదం సూర్యప్రకాశ్, హాకీ సంఘం జిల్లా అధ్యక్షుడు బివి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, ప్రతినిధులు పల్లెం వేణుగోపాల్, ఉడుముల రాము, గౌరీప్రసాద్, అంజన్న అభినందించారు.

సాగుకు సమాయత్తం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ముంగారు వానలు మొదలయ్యాయి. జూన్ నెల నుంచి ఖరీఫ్ మొదలవుతుంది. సీజన్ ప్రారంభమవడమే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ వర్షాలు మొదలయ్యాయి. ఇది వరకే మేనెలలోనూ వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు దుక్కులు చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పుడు పడుతున్న వర్షాలతో వ్యవసాయ పనులు మరింతగా ఊపందుకున్నాయి. అయితే వర్షాలు అన్ని మండలాల్లోనూ ఒకే రకంగా వానలు పడలేదు. అనంతపురం జిల్లాలో జూన్‌లో తొమ్మిది మండలాల్లో ఇంకా పదును కాలేదు. అయితే విత్తనం విత్తుకోవడానికి ఇంకా సమయం ఉండటంతో ఈనెలలో ఒకటి, రెండు మంచి వర్షాలు పడినా సాగుకు సిద్ధమవుతారు. ఒకవైపు ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తోంది. ఇతర పంట విత్తనాలు కూడా పంపిణీ చేపట్టింది. రైతులు కొనుగోళ్లు ప్రారంభించి విత్తనాలు విత్తుకునేందుకు సమయత్తమవుతున్నారు. అందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకునే పనిలోపడ్డారు. ప్రభుత్వం ఈ వారంలో రైతు భరోసా, పంటల బీమాను రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. ఇది కొంత వరకు తోడ్పాటు కానుంది. అయితే ఇప్పుడున్న ధరల్లో ఇవి ఏ మాత్రం సరిపడే పరిస్థితి లేదు. డీజల్ ధరలు పెరుగుదలతోపాటు, విత్తనాలు, ఎరువుల మందులు ధరలు పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సాగయ్యేది వేరుశనగ పంటయే. వర్షాధారం కిందనే ఇది సాగవుతుంది. రెండు జిల్లాల పరిధిలో కలిపి 16 లక్షల ఎకరాల వరకు సాధారణ సాగుంటుంది. అయితే గత కొంతకాలంగా ఈ విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గత ఖరీఫ్‌లో 12 లక్షల ఎకరాలకే పరిమితమైంది. తక్కినది పత్తి, కంది, ఆముదం పంటల సాగు పెరుగుతోంది. ఈ సీజన్ సాగునీటి అంచనాలను జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రధాన జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు వచ్చే నీటిని తుంగభద్ర అధికారులతోపాటు ఇంజనీర్లు అంచనావేశారు. 28 టీఎంసీల వరకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు పొందే అవకాశముందని అంచనా వేశారు. అయితే ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిలువలు పూర్తిగా అడుగంటాయి. జులైకి నీటి విడుదల ఉండే అవకాశముంటుందని అంచనా వేశారు. అంతలోపు వర్షాలొచ్చి నీరు డ్యామ్‌లోకి చేరితే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటిని పొందేందుకు వీలుంటుంది. అక్కడి నీటి లభ్యతను బట్టి జిల్లాలోనూ సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తారు. నీటిని జిల్లాలో ఏ రకంగా పంపిణీ చేయాలన్నది సాగునీటి సలహా మండలిలో నిర్ణయించనున్నారు. హంద్రీనీవా నీరు కూడా శ్రీశైలం జలాశయంకు వచ్చే నీటి లభ్యతను బట్టి రానుంది. గతేడాది తుంగభద్ర, శ్రీశైలం రెండింటి వలన జిల్లాకు 50 టిఎంసిలకు వరకు నీరు వచ్చింది. దీంతో చెరువులు, జలాశయాల్లో ఇప్పటికీ నీరు పుష్కలంగానే ఉండటం గమనార్హం. ఈ ఏడాది జూన్ నుంచి మంచి వర్షాలొస్తే ఆయకట్టుకు పెద్దగా సమస్య లేకుండా ఉండదు. జిల్లాలో రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. ఏది ఏమైనా ఖరీఫ్ సాగుకు అవసరమైన సన్నద్ధత అటు రైతుల నుంచి ఇటు అధికారుల నుంచి కూడా ప్రారంభమైంది. ఇక నుంచి పనులు ఊపందుకోనున్నాయి.



15న మహాధర్నా, వంటావార్పు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 15న శ్రీ గాంధీ హరిజన హాస్టల్ కోర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు ఆనంద్‌రాజ్, లాలూప్రసాద్, మీనుగ గోపాల్, మోపిడి వన్నూరుస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గాంధీ హరిజన హాస్టల్‌కు సంబంధించిన భూ రికార్డులను తారుమారు చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ కమిటీ సభ్యులు మోపిడి గోవిందు, పెద్ద ముష్టూరు ఓబయ్య, రామకృష్ణ, కోనాపురం ఎర్రిస్వామి, మాలాపురం ఎర్రిస్వామి, రేణుమాకులపల్లి సుభాష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హాస్టల్ కమిటీ నాయకులు